మన సమగ్ర
ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి
ఎప్పటి వార్తలు
అప్పుడే...
5 PM
శనివారం , 07, నవంబర్ , 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

కాంగ్రెస్ సర్కార్‌కి లిట్మస్ టెస్ట్- పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరుపై

విద్యావంతుల తీర్పు ఏంటి?

- అన్ని వర్గాల గ్రాడ్యుయేట్లు ఓట్లు వేసే ఎన్నిక
- కాంగ్రెస్ గెలిస్తే పాజిటివ్ వేవ్



తెలంగాణలో త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి లిట్మస్ టెస్ట్ గా మారాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేపడుతున్న పాలనా నిర్ణయాలు, హామీల అమలుపై విద్యావంతులైన ఓటర్లు ఏ తరహా ముద్ర వేయబోతున్నారనేది ఈ ఎన్నికల ద్వారా తేలనుంది. ఓ రకంగా చెప్పాలంటే, ఈ పట్టభద్రుల పోరు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు ఒక అప్రకటిత రిఫరెండం లాంటిదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పట్టభద్రుల నియోజకవర్గం అనేది ఒక నిర్దిష్ట సమూహానికో లేదా ప్రాంతానికో పరిమితమైంది కాదు. ఇందులో నిరుద్యోగ యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, ఐటీ నిపుణులు, మేధావులు , గ్రామీణ-పట్టణ ప్రాంతాలకు చెందిన అన్ని వర్గాల విద్యావంతులైన ఓటర్లు భాగస్వాములుగా ఉంటారు. ఈ తరగతి ఓటర్లు పొలిటికల్ గా ఎంతో చైతన్యవంతంగా ఆలోచిస్తారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం నుంచి అందుతున్న లబ్ధి, ఉద్యోగ నోటిఫికేషన్ల భర్తీ, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల , జీతాల చెల్లింపుల వంటి అంశాలను నిశితంగా గమనించి తమ తీర్పును బ్యాలెట్ ద్వారా వినియోగిస్తారు.ఒకవేళ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తే.. ప్రభుత్వంపై ప్రజల్లో, ముఖ్యంగా యువత , విద్యావంతుల్లో బలమైన పాజిటివ్ వేవ్ ఉందనే అభిప్రాయానికి కాంగ్రెస్ అధిష్టానం నొక్కి చెప్పగలదు. ఇది వచ్చే స్థానిక సంస్థల పోరుకు, ఇతర సాధారణ ఎన్నికలకు పార్టీకి మైలేజ్ ఇస్తుంది. కానీ, ఒక్క స్థానంలో ఫలితం తేడా వచ్చినా లేదా స్వల్ప తేడాతో ఓటమి పాలైనా.. విపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు పెద్ద ఆయుధం దొరికినట్లవుతుంది. కాంగ్రెస్ సర్కార్‌పై అప్పుడే తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైంది అంటూ గళమెత్తేందుకు విపక్షాల ప్రచారానికి ఇది ఆజ్యం పోసినట్లవుతుంది.ఇప్పటికే నిరుద్యోగుల ఆందోళనలు, ఉద్యోగ ప్రకటనల్లో జాప్యం, రైతు భరోసా , పెన్షన్ల పంపిణీపై విపక్షాలు నిరంతరం దాడి చేస్తున్న వేళ.. పట్టభద్రుల ఓటింగ్ నెగెటివ్‌గా పడితే ఆ ప్రచారం మరింత జోరందుకుంటుంది. ఇది రేవంత్ రెడ్డి సర్కార్‌కి తీవ్ర రాజకీయ ముప్పుగా మారే ప్రమాదం ఉంది. అందుకే ఈ ఎన్నికలను తేలికగా తీసుకోవడం పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదని, ప్రతి ఒక్క ఓటరును వ్యక్తిగతంగా కలుస్తూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన పకడ్బందీ పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన కాంగ్రెస్ నాయకత్వం, సమర్థులైన అభ్యర్థులను ఖరారు చేయడమే కాకుండా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేసింది. కానీ, కేవలం క్యాంపెయిన్ మాత్రమే సరిపోదని.. నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉన్న చిన్నపాటి అసంతృప్తిని ముందే గుర్తించి, వారితో నేరుగా చర్చలు జరిపి నమ్మకాన్ని పునరుద్ధరించాల్సిన బాధ్యత మంత్రివర్గంపై ఉంది. ప్రతిష్టాత్మక హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ , ఉమ్మడి జిల్లాల స్థానాల్లో చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా నష్టం ఊహించని రీతిలో ఉంటుంది.

ఎల్‌నినో విపత్తుకు ప్రభుత్వమే కారణమనడం దారుణం



హైదరాబాద్, నవంబర్ 7: అబద్ధాలు ప్రచారం చేస్తూ ఇంకెన్ని రోజులు ప్రజలను మోసం చేస్తారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆయన బీఆర్ఎస్ పార్టీని తీవ్రంగా విమర్శించారు.'కరోనా సృష్టికర్త కేసీఆర్ అని మేం అనలేమా?.. ఎబోలా సృష్టికర్త హరీష్ రావు అని అనలేమా?.. అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ హరీశ్ రావు. ఆయన కళ్ళు ఉండి కూడా.. గుడ్డివాడిలా వ్యవహరిస్తున్నారు. కరెంట్ డిమాండ్ ఎక్కువగా ఉన్నా.. మేం రైతులకు కరెంట్ ఇస్తున్నాం.ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రం కష్టకాలంలో ఉన్న సందర్భంలో.. ప్రభుత్వమే విపత్తుకు కారణమనడం ఎంత వరకు సమంజసనీయం అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. విపత్తుకు ప్రభుత్వాన్ని బద్నాం చేయడమంటే.. బాధ్యత నుంచి తప్పించుకోవడమే అవుతుందని తీవ్రంగా స్పందించారు. మీ హయాంలో కంటే మేమే రైతులను ఎక్కువగా ఆదుకున్నాం. అబద్ధాలు ప్రచారం చేస్తే ప్రజలు ఊరుకోరు. కాళేశ్వరం కట్టి గోదావరి నీళ్లను తెలంగాణకు ఉపయోగం లేకుండా చేశారు. కృష్ణా నీటిని పక్క రాష్ట్రానికి రాసిచ్చి తెలంగాణకు మరణ శాసనం రాసింది ఎవరు.. కేసీఆర్ కాదా..' అంటూ విప్ శ్రీనివాస్ నిలదీశారు.

రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి



సిద్దిపేట, నవంబర్ 7: రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితుల కారణంగా సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.ముఖ్యంగా వడ్ల కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా వెంటనే మిల్లుల అలాట్‌మెంట్ పూర్తి చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పంటలు చేతికందక రైతులు నష్టపోయారని.. ఎండిపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. పంట నష్ట పోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని హరీశ్ రావుసూచించారు.పక్క రాష్ట్రాల్లో పంట నష్టాన్ని గుర్తించి రైతులకు పరిహారం అందిస్తూ అండగా నిలుస్తుంటే.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం రైతుల సమస్యలను పట్టించుకోకుండా మొద్దు నిద్రలో ఉందని తీవ్రస్థాయిలో విమర్శించారు. మార్కెటింగ్ శాఖలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో అధికారులు, సిబ్బంది కొనుగోళ్ల ప్రక్రియలో పనిచేయడానికి ముందుకు రావడం లేదని ఆరోపించారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నా రు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కొనుగోలు కేంద్రా లను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, మిల్లుల కేటాయింపులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని హరీశ్ రావు ప్రభుత్వాన్ని కోరారు.

రేషన్ బియ్యం పంపిణీలో గోల్‌మాల్

- తూకం వేయకుండానే సరఫరా చేస్తున్న ఇన్‌చార్జులు
- బస్తాకు 6-7కిలోలు తక్కువగా వస్తున్నాయంటున్న డీలర్లు



వరంగల్: తూకాల్లో మోసం చేసిన రేషన్ డీలర్లను సస్పెండ్ చేస్తున్న అధికారులు ఆ తప్పు తమ వద్ద జరుగుతున్నప్పటికీ కట్టడి చేయడంలేదు. ఒక్కోబస్తాలో 6-7 కిలోలు తక్కువ ఉండటంతో డీలర్లు నష్టపోతున్నారు. మిల్లింగ్ దగ్గరే ఈ మోసం జరుగుతుండగా అధికారులు ఆ తప్పును డీలర్లపై వేసి చేతులు దులుపుకుంటున్నారు. నిబంధనల ప్రకారం స్టేజ్-1 గోదాములకు వచ్చిన బియ్యాన్ని స్టేజ్-2 గోదాములలో నిల్వచేసుకొని అక్కడ నుంచి డీలర్లకు అందించాలి. అది కూడా డీలర్ వేలిముద్ర(బయోమెట్రిక్) తీసుకున్నాకే బియ్యం బస్తాలను తూకం వేసి లారీలో లోడింగ్ చేసి పంపించాలి.కానీ, అందుకు విరుద్ధంగా గోదాము వద్దకు డీలర్ వెల్లకముందే డీలర్‌కు ఫోన్‌చేసి మీకు ఓటీపీ వచ్చింది చెప్పండని గోదాముల ఇన్‌చార్జులు అడుగుతున్నారు. ఓటీపీ ఏంటని ప్రశ్నిస్తే బియ్యం ఎప్పుడు వస్తాయోనన్న భయంతో డీలర్లు ఓటీపీ చెబుతున్నారు. దీంతో డీలర్ లేకుండానే.. తూకం వేయకుండానే డీలర్లకు బియ్యం పంపిస్తున్నారు. అలా వచ్చిన బియ్యాన్ని డీలర్లు తూకం వేస్తే ఒక్కో బస్తాలో 6నుంచి 7 కిలోలు తక్కువగా ఉండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా ప్రజలకు పంపిణీ చేస్తున్న సమయంలో తక్కువ తూకం వేస్తున్నారని తనిఖీల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, తమ మాట వినని వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు.50కిలోల బియ్యం బస్తాలు లారీలలో లోడింగ్ అన్‌లోడింగ్ చేసే సమయంలో కొంత తరుగు పోతుంది. అది మిల్లింగ్ అయినప్పటి నుంచి డీలర్ షాప్‌కు చేరేవరకు ఒక బస్తాకు కనీసం 2కిలోల బియ్యం లోటు ఉంటుంది.డీలర్లు ప్రశ్నిస్తున్నారు.కాగా, గత ఆగస్టులో మూడునెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేసిన తర్వాత నవంబరు నెల బియ్యం పంపిణీ ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. జిల్లాలో 509 రేషన్‌షాపులు ఉండగా 15రోజుల ముందే రేషన్‌షాపులకు బియ్యం సరఫరా చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్ల పంపిణీలో ఆలస్యం జరుగుతోంది.

ఈ20 పెట్రోల్ వివాదం- కేంద్రంపై

రాహుల్ గాంధీ ప్రశ్నల వర్షం



న్యూఢిల్లీ : దేశంలో ఈ20 పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం అంశం రాజకీయ వివాదానికి దారితీసింది. పెట్రోల్‌లో నిర్దేశించిన 20 శాతం పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్న చమురు కంపెనీలపై కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు చర్యలు తీసుకుంటుందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కర్ణాటకలో నిర్వహించిన పరీక్షల్లో పలు పెట్రోల్ నమూనాల్లో ఇథనాల్ శాతం పరిమితిని మించినట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు.పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలుపుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం ఏడు జిల్లాల నుంచి పెట్రోల్ నమూనాలను సేకరించి గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించిందని తెలిపారు. మొత్తం 14 నమూనాలను పరీక్షించగా, వాటిలో 11 నమూనాల్లో ఇథనాల్ శాతం 20 శాతానికి మించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) పెట్రోల్ నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని ఆయన వెల్లడించారు.

24న హనుమకొండలో కేటీఆర్ సభ



హనుమకొండ: ఈనెల 24న హనుమకొండలో బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వ కుంట్ల తారకరామారావు (కేటీఆర్) పాల్గొననున్న సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు కసరత్తు ముమ్మరం చేశారు. సభ నిర్వహణకు అనువైన స్థలాల ఎంపికపై దృష్టి సారించినట్లు తెలిపారు. భారీ జన సమీకరణతో సభను నిర్వహించి పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపడంతో పాటు రాజకీయంగా తమ బలాన్ని చాటుకోవాలని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు.సభ నిర్వహణకు సంబంధించి హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానం, కాకతీయ ప్రభుత్వ కళాశాల (కేడీసీ) క్రీడా మైదానాలను బీఆర్ఎస్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్ పరిశీలించారు. సభకు హాజరయ్యే కార్యకర్తలు, ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా పార్కింగ్ స్థలాలకు సంబంధించి ఇ ప్పటికే రెండుచోట్ల అధికారుల నుంచి అను మతులు తీసుకున్నట్లు సమాచారం. కేటీఆర్ సమక్షంలో ఓ ప్రైవేటు విద్యాసంస్థల అధినేత సుమారు 10 వేల మందికి పైగా కార్యకర్తల తో చేరనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

తగ్గిన జలమండలి

నీటి సరఫరా



హైదరాబాద్: కోటి జనాభా దాటిన హైదరాబాద్ మహానగరంలో తాగునీటి సరఫరా సవాలుగా మారింది. వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అగాధానికి పడిపోవడంతో నగరవాసులు ఇప్పటికే నీటి చుక్క కోసం తీవ్ర అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ జలమండలి పైపులైన్ల ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలకు నిరంతరాయంగా నీటిని అందించడంలో తీవ్ర నిస్సహాయత ఎదుర్కొంటోంది. ఇలాంటి తరుణంలో వేలాది బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, ఐటీ కారిడార్‌లోని విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, చివరకు శివారు కాలనీల దాహార్తిని తీరుస్తున్నది ప్రైవేటు బోర్ల ఆధారంగా నడిచే నీటి ట్యాంకర్లే. అయితే, ముందస్తు ప్రత్యామ్నాయాలు ఆలోచించకుండా హైడ్రా ఏకపక్షంగా రంగంలోకి దిగి అక్రమ బోర్ల పేరిట విరుచుకుపడటంతో మహానగరం ఒక్కసారిగా నీటి గందరగోళంలోకి జారుకుంది.

సోమారపు పులమ్మను పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

20 లక్షలతో ఆధునిక మరుగుదొడ్లకు శంకుస్థాపన



జనగామ జిల్లా ప్రతినిధి జె.ఉపేందర్, నవంబర్ 07(ప్రజావాణి):
జనగామ నియోజకవర్గం లోని తొర్రూరు మండలం, వెలికట్టె గ్రామ కంటెస్టెడ్ సర్పంచ్ సోమారపు పులమ్మ ఇటీవల మోకాళ్ల కు శస్త్రచికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి వారి నివాసానికి శనివారం వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా పులమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రజా జీవితంలో కొనసాగుతున్న నాయకులు, కార్యకర్తల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, కష్టసుఖాల్లో వారికి అండగా ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే స్వయంగా వచ్చి పరామర్శించడంతో పులమ్మ గారు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం తొర్రూరు పట్టణంలో పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించే లక్ష్యంతో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) నిధుల ద్వారా రూ.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆస్పిరేషనల్ టాయిలెట్స్ – 2 నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణాల్లో పరిశుభ్రత, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ఉపయోగపడేలా ఆధునిక సౌకర్యాలతో మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. తొర్రూరును పరిశుభ్రమైన, సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, వార్డు కౌన్సిలర్లు చపాల బాపు రెడ్డి, పెద్దగాని కళావతి సోమన్న, భద్రు నాయక్, బసనబోయిన ఐలమ్మ, పట్టణ అధ్యక్షులు వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్, మండల అధ్యక్షులు రవీంద్ర చారి, కంటెస్టెడ్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

సేవకు గుర్తింపుగా సత్కారం.. ఆత్మీయతతో బొట్టు కృష్ణ జన్మదిన వేడుకలు!

“నా తల్లిదండ్రులు నాకు జన్మనిచ్చారు.. మీరు నాకు జీవితాన్నిచ్చారు.. అయ్యా! మీ రుణం ఎలా తీర్చుకోను?” -- బొట్టు కృష్ణ



కూకట్‌పల్లి, నవంబర్ 6 (ప్రజావాణి):
సేవాభావానికి సన్మానం.. ఆత్మీయతకు అభినందనం.. జ్ఞాన ప్రచారానికి అందించిన సహకారానికి గుర్తింపుగా జ్ఞానమాల దాత బొట్టు కృష్ణ జన్మదిన వేడుకలను కూకట్‌పల్లిలోని అంబేద్కర్ పార్కులో ఘనంగా నిర్వహించారు.నిరంతర నిత్య జ్ఞానమాల కార్యక్రమానికి విశేష సహకారం అందిస్తున్న బొట్టు కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని జ్ఞానమాల నిర్వహణ సభ్యులు ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహుమతిగా అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బొట్టు కృష్ణ భావోద్వేగంగా మాట్లాడుతూ.. “నా తల్లిదండ్రులు నాకు జన్మనిచ్చారు.. మీరు నాకు జీవితాన్నిచ్చారు.. అయ్యా! మీ రుణం ఎలా తీర్చుకోను?” అంటూ జ్ఞానమాల సభ్యులపై తనకున్న అభిమానాన్ని, కృతజ్ఞతను వ్యక్తం చేశారు. మీ అందరి అంతులేని అభిమానం, ఆప్యాయత ఎప్పటికీ మరచిపోలేనివని పేర్కొంటూ, తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి సత్కరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జ్ఞానమాల నిర్వహణ కార్యదర్శి మద్దెల గిరి, సభ్యులు పోతురాజు రమేష్, పసులది రాములు, బచ్చలి బాలరాజు, దుబాల మురహరి, చంద్ బాషా, కళ్లెం నాగరాజు, గంగుల వెంకటేష్, బచ్చలి వినోద్ రావు తదితరులు పాల్గొని బొట్టు కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తొర్రూరులో రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి





జనగామ జిల్లా ప్రతినిధి జె.ఉపేందర్, నవంబర్ 07(ప్రజావాణి):
తొర్రూరు పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తోందని పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.జనగామ నియోజకవర్గం తొర్రూరు పట్టణంలోని అన్ని వార్డుల్లో రూ.80 లక్షల సాధారణ నిధుల (వీ+ళీ) తో చేపట్టనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు మరియు కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.తొర్రూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, వార్డు కౌన్సిలర్లు బాపు రెడ్డి, పెద్దగాని కళావతి సోమన్న, భద్రు నాయక్, బసనబోయిన ఐలమ్మ, పట్టణ అధ్యక్షులు వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్, మండల అధ్యక్షులు రవీంద్ర చారి, కంటెస్టెడ్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ సంక్షేమ పథకాల సాధనకు ర్యాలీ.. పోలీసులకు వినతి



ప్రజావాణి,కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 07: ఎస్సీ సంక్షేమ పథకాల సాధన కోసం నిర్వహించనున్న ర్యాలీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో వెల్దండ సీఐ రఘువీర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఈదులపల్లి జంగయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు తాండ్ర బాలు, ఉపాధ్యక్షుడు దూల రామస్వామి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానలో వైద్యం దొరకట్లేదు

పేదవాడు ఎక్కడికి పోవాలి..?
ప్రభుత్వాలు మారాయి.. దవాఖానలు మారలేదు!
పేదవాడి ప్రాణం.. ప్రైవేటు ఆసుపత్రికి బలి!లి
వైద్యం భరోసా కాదు.. భయంగా మారింది!
బిల్లు కట్టకుంటే శవం కూడా ఇవ్వరా..?
సర్కారు దవాఖాన ఉంటే ఏం లాభం.
పది రోజుల వైద్యం.. పదేళ్ల సంపాదన ఖాళీ
పేదలకు వైద్యం.. ఇంకా కలగానే మిగిలిపోయిందా..?
స్కానింగ్ పేరుతో దోపిడీ.. పేదవాడు ఎలా బతకాలి..?

ములుగు ప్రతినిధి శ్రీకాంత్(ప్రజావాణి)
అన్ని సదుపాయాలతో సర్కారు దవాఖానలు పేదలకు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి?
ప్రభుత్వాలు మారుతున్నా ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితులు మాత్రం మారదం లేదనే విమర్శలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నపాటి వైద్య పరీక్షలు, సాధారణ చికిత్సలు మొదలుకొని ప్రసూతి సేవలు, అత్యవసర వైద్యం వరకు పూర్తిస్థాయి సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దపెద్ద వ్యాధులు వస్తే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. స్కానింగ్‌లు, రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే వైద్య ఖర్చులు సామాన్యులకు భారంగా మారుతున్నాయి.వారం, పది రోజుల వైద్యం కోసం కుటుంబాలు సంవత్సరాలుగా కూడబెట్టుకున్న సంపాదనను ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో రోగి మరణించిన తర్వాత కూడా ఆసుపత్రి బిల్లులు చెల్లించకపోతే మృతదేహాన్ని అప్పగించదంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి.సామాన్య ప్రజల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని అధిక వైద్య ఖర్చులతో ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులు, అవసరమైన మందులు, ఆధునిక వైద్య పరికరాలు, అన్ని రకాల పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలి.పేదవాడు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలంటే భయపడే పరిస్థితి ఎందుకు రావాలి? పేదలకు నాణ్యమైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత కాదా? ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి సామాన్యుడికి వైద్య భరోసా కల్పించాలి.



ఆపదలో అండగా ఆపన్నహస్తం

అజయ్ కుటుంబానికి లింగారంతండా యువత ఆర్థిక సహాయం
ఐక్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలి: లంబాడి ఐక్యవేదిక పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు వి. శోభన్ నాయక్



కూసుమంచి (మన ప్రజావాణి) ప్రతినిధి =ఏ:
ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని నిరూపిస్తూ లింగారంతండాకు చెందిన యువత, గ్రామస్తులు సేవా దృక్పథంతో ముందడుగు వేశారు. గ్రామానికి చెందిన అజయ్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో ఆపన్నహస్తం కార్యక్రమం ద్వారా యువత తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా లంబాడి ఐక్యవేదిక పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు వి. శోభన్ నాయక్ మాట్లాడుతూ యువత, గ్రామ ప్రజలు ఐక్యతతో ఉండి గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని మనస్ఫూర్తిగా కోరారు. కష్టకాలంలో ఒకరికొకరు తోడుగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి కిషన్, బాలకృష్ణ, భరత్ కుమార్, రెడ్యా నాయక్, జవహర్లాల్, నాగేశ్వరరావు, పాపారావు, నాగులు, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రమేష్, భాస్కర్, శంకర్ నాయక్, రవీజీ, మాను, జగపతి, వెంకటేష్, కిషన్ బానోతు, వీరబాబు, ఉపేందర్, ధర్మ నాయక్, నాగేష్ వాడిత్య తదితరులు ఆర్థిక సహకారం అందించారు.ఈ మంచి కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ఐక్యత, సేవాభావం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

వరుస ఘటనలతో మోడల్ స్కూల్‌పై సన్నగిల్లుతున్న విశ్వాసం!

విద్యార్థుల భద్రతపై కలెక్టర్ ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి
ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ డిమాండ్

బెజ్జంకి, నవంబర్ 7 (ప్రజావాణి)
సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని మోడల్ స్కూల్‌లో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ూ¤ఖీ బెజ్జంకి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ అన్నారు.విద్యార్థుల భద్రత,పాఠశాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా నిర్లక్ష్యానికి బాధ్యులైన సిబ్బంది



పై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మొత్తం సిబ్బందిని మార్చి సమర్థులైన వారిని నియమించాలని కోరారు.పాఠశాలలో విద్యార్థులకు భద్రతతో కూడిన విద్యా వాతావరణం కల్పించి తల్లిదండ్రుల్లో తిరిగి విశ్వాసం నింపాలని సూచించారు.కలెక్టర్ వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థుల, తల్లిదండ్రులతో కలిసి ూ¤ఖీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని దొంతరవేణి మహేష్ హెచ్చరించారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com